క్లుప్తంగా

ఘనంగా శివసాయి మందిర వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

ముత్తుకూరు: మండలంలోని వల్లూరు గ్రామంలో ఉన్న శివ సాయిబాబా మందిరంలో సోమవారం ద్వితీయ వార్షికోత్సవాన్ని ఘనంగా జరిపారు. నిర్వాహకుడు వల్లూరు మోహనరావు ఆధ్వర్యంలో మందిరాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. విశేష హోమం, పుష్పయాగం కార్యక్రమాలు జరిగాయి. అనంతరం గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

సీపీఎం మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ప్రదర్శిస్తున్న నాయకులు


పొదలకూరు: సీపీఎం 27వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు అల్లాడి గోపాల్, కె.పెంచలనర్సయ్య మాట్లాడుతూ 47 సంవత్సరాల తర్వాత నెల్లూరులో సభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో సభలు జరుగుతాయన్నారు. 3వ తేదీ మధ్యాహ్నం భారీ ర్యాలీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బి.మనోహర్, నాయకులు మణి, వెంకటేశ్వర్లు, రంగయ్య, కుమార్, రషీద్ పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం



బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం మండలం విలియమ్స్‌పేట గ్రామంలో షేక్ ఖాదర్‌బాషా అనే వ్యక్తి బెల్టు దుకాణం నిర్వహిస్తుండగా పోలీసులు ఆదివారం రాత్రి దాడులు చేశారు. 30 బాటిళ్లను స్వాధీనం చేసుకుని సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సోమవారం తెలిపారు.

అదనపు డీఎంహెచ్ఓ పరిశీలన



కోవూరు: మండల కేంద్రమైన కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదరవలీ సోమవారం పరిశీలించారు. లెప్రసీ సర్వేపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకట చలపతి ఉన్నారు.

జయప్రదం చేయండి



బుచ్చిరెడ్డిపాళెం: నెల్లూరులో జరుగుతున్న సింహపురి సాంస్కృతిక ఉత్సవాలను జయప్రదం చేయాలని ప్రజానాట్య మండలి మండలాధ్యక్షుడు మునుస్వామి కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈనెల 29వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయన్నారు. షేక్.జానిబాషా, రఘురామయ్య, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

సోషల్ మీడియా యాక్టివిస్టులతో ఎమ్మెల్సీ ములాఖత్



జైలు వద్ద ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

వెంకటాచలం: మండలంలోని చెముడుగుంట వద్ద సెంట్రల్ జైల్లో ఉన్న సోషల్ మీడియా యాక్టివిస్టులను ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం ములాఖత్ ద్వారా మాట్లాడారు. గుడివాడకు చెందిన నక్కిన శ్యామ్, కర్నూలుకు చెందిన బాలాజీ రెడ్డిపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడంతో జైల్లో ఉన్నారు. వారితో ఎమ్మెల్సీ మాట్లాడారు.

కలవరమే మిగిలింది

- తెలంగాణ వంగడాలతో మునుగుతున్న రైతులు
- సహకరించని వాతావరణ పరిస్థితులు



ఎదుగుదల తక్కువగా ఉన్న వరి పైరు

బుచ్చిరెడ్డిపాళెం: కోటి ఆశలతో విస్తారంగా వరిపైరును సాగు చేసిన రైతులు ఆందోళనలో పడ్డారు. ఆశించిన స్థాయిలో పైర్లు ఎదగకపోవడం, ముందస్తు గానే వెన్నుతీయడంతో తీవ్ర నష్టాలు వచ్చాయని కలవరం చెందుతున్నారు. దీంతో పాటు వాతావరణంలో తేమశాతం ఎక్కువగా ఉండడం, ఉష్ణోగ్రత తక్కువగా ఉండడం వల్ల కూడా ఎక్కువ తెగుళ్లు ఆశిస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

మన వాతావరణానికి సహకరించని వైనం

కోవూరు నియోజకవర్గంలో సుమారు 50 వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టారు. ఇందులో అధిక శాతం తక్కువ కాల పంటలైన కేఎస్ఎం 1138, ఆర్ఎస్ఆర్ 15048 వరి వంగడాలను ప్రస్తుతం రైతులు అధికంగా సాగు చేస్తున్నారు. ఈ వంగడాలు పూర్తిగా తెలంగాణ శాస్త్రవేత్తల సృష్టి. వారు అక్కడి వాతావరణానికి అనుకూలంగా తయారు చేసిన విత్తనాలతో దిగుబడి బాగానే కనిపించింది. ఆ విత్తనాలను కొందరు డీలర్లు మన జిల్లాలో పరిచయం చేయడంతో మొదటి రెండు పంటలు బాగానే దిగుబడి రావడం రైతుల్లో ఆశలు రేపింది. మూడో దఫా కూడా అవే విత్తనాలను వాడటం అనర్థానికి దారి తీసింది. ఈ సంవత్సరం ప్రధానంగా వాతావరణ స్థితిగతులు సహకరించకపోవడంతో పైర్లు దెబ్బ తిన్నాయి.

ముందస్తుగా వేయడం వల్లే..

తెలంగాణ వరి వంగడాలైన కేఎస్ఎం, ఆర్ఎస్ఆర్ రకాలు నవంబర్ 15 నుంచి డిసెంబర్ 15 లోపల వేసుకోవాలని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. కానీ రైతులు ముందస్తుగా వేయడం వల్ల పిలక దశకు రాకముందే వెన్ను రావడం జరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. తక్కువ కాలపరిమితిలో వచ్చే వరి వంగడాల పట్ల జాగ్రత్త వహించకపోతే ముందస్తు వెన్నులు తీయడం పరిపాటి అన్నారు. 25 రోజులు వేయాల్సిన నాట్లు ఐదు రోజుల తేడాతో వేసినా ముందస్తు వెన్ను వస్తుందంటున్నారు.

కొనసాగించడం తప్పు



తెలంగాణ శాస్త్రవేత్తలు రెండు సంవత్సరాల కాల పరిమితితో తయారు చేసిన కేఎస్ఎం, ఆర్ఎస్ఆర్ విత్తనాలను మన రైతులు మూడో సంవత్సరం కూడా కొనసాగించడం తప్పు. డీలర్ల మాటలు నమ్మి రైతులు ఇతర ప్రాంతాల విత్తనాలను వాడడం మంచిది కాదు.

– సుజాత, ఏడీ, వ్యవసాయ శాఖ

మన విత్తనాలే మంచివి



నెల్లూరు వ్యవసాయ శాస్త్రవేత్తలు తయారు చేసిన బీపీటీ, ఎన్ఎల్ఆర్ రకాలు మన ప్రాంత వాతావరణానికి ఎంతో శ్రేయస్కరం. మన వాతావరణ సమతుల్యతకు తగినట్లు తయారు చేసిన విత్తనాలు 80 శాతం మొలకెత్తుతాయని, తద్వారా రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లే అవకాశం లేదు. తెగుళ్లు తక్కువగా వచ్చే మన వంగడాలు స్థిరమైన ధరలు వచ్చే విధంగా ఉంటాయి.

– సురేంద్రరెడ్డి, ఏఓ, వ్యవసాయ శాఖ

దిగుబడులు తగ్గే అవకాశం



గతేడాది కన్నా వరిపంట దిగుబడులు తక్కువయ్యే అవకాశం ఉంది. వాతావరణం, చలిగాలులు కుదుకోవడం వల్ల పైరు ఎదుగుదల లేక తెగుళ్లు ఆశించింది.

– మోచర్ల శ్రీనివాసులు, పడుగుపాడు

ఆందోళన నెలకొంది



ఈ ఏడాది మొదటి పైర్లు ఆశాజనకంగా లేవు. నాట్లు వేసిన వెంటనే 15 రోజుల్లోపు వెన్ను తీయడంతో ఆందోళన నెలకొంది. ఇతర రాష్ట్రాల విత్తనాలను సరఫరా చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. వాతావరణం కూడా అనుకూలించక పోవడం దిగుబడులపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

– వినయ్ నారాయణ, బుచ్చిరెడ్డిపాళెం

వాహనదారులు హెల్మెట్ ధరించాలి



పొదలకూరు: ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



ముత్తుకూరు: సేఫ్టీ పాకెట్ బుక్‌ను ప్రదర్శిస్తున్న సీఈఓ తదితరులు

పొదలకూరు: ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై ఎస్కే హనీఫ్ సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా పట్టణంలో సోమవారం పోలీసులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వైద్యులు నజ్మా సుల్తానా, రాధా, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోర్టులో..

ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నం పోర్టులో సోమవారం రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహించారు. సీఈఓ జగదీష్ పటేల్ ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. కార్మికులు, ఉద్యోగులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఏకేపీఎల్ సెక్యూరిటీ అండ్ సేఫ్టీ బృందం ప్రచురించిన సేఫ్టీ పాకెట్ బుక్‌ను ఆయన ఆవిష్కరించారు.

➡ **కోవూరు:** ప్రమాదాల నివారణ ప్రతిఒక్కరి బాధ్యత అని సీఐ సుధాకర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు కోవూరు మండల కేంద్రంలో ఎస్సై వై.రంగనాథ్‌గౌడ్‌తో కలిసి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. వాహనదారులు తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.



కోవూరులో..

సమస్యల పరిష్కారానికి చర్యలు

మనుబోలు: సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీదారుల సమస్యలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి నిర్ణీత సమయంలోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జలజాక్షి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దార్

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



కోవూరు మండలంలోని పాటూరులో..

కొడవలూరు : గ్రామాల్లో నిర్వహించే పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పౌరసరఫరాల శాఖ రాష్ట్ర డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి కోరారు. మండలంలోని గండవరంలో యల్లాయపాళెం పశువైద్యశాల ఆధ్వర్యంలో సోమవారం ఉచిత పశు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. అనంతరం 435 పశువులకు డీవార్మింగ్ మందు, 130 దూడలు, 300 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. యల్లాయపాళెం పశువైద్యాధికారి జె.సురేష్ బాబు, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ పి.వెంకటేశ్వర్లు, సర్పంచ్ రాజకుమారి, ఉప సర్పంచ్ ఆలం మాలకొండయ్య, నీటి సంఘం అధ్యక్షుడు కంచి ఈశ్వర్‌రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ కె.వెంకయ్య, పశుగణన సహాయకులు జి.రాఘవయ్య, డి.సుభాషిణి, టి.వెంకటరమణయ్య, కె.వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

➡ **కోవూరు :** మండలంలోని పాటూరు చక్రాలదిబ్బ కాలనీలో పశువైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. లేగుంటపాడు పశు వైద్యురాలు ప్రీతి సాల్మన్ పశువులకు వైద్య పరీక్షలు చేశారు. 30 గేదెలకు నట్టల నివారణ ముందు, నులిపురుగుల మందు, 40 గొర్రెలకు నట్టల నివారణ మందు తాపించారు. పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ కృష్ణమౌర్య పాల్గొన్నారు.



కొడవలూరు : పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న పౌరసరఫరాల శాఖ డైరెక్టర్

స్వల్పంగా వినతులు

పొదలకూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. రైతుల నుంచి అతితక్కువ సంఖ్యలో వినతులందాయి. డిప్యూటీ తహసీల్దార్ సురేఖకు భూ వివాదాలపై పలువురు అర్జీలను అందజేశారు. తహసీల్దార్ సెలవు పెట్టడంతో ఇతర మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు.

ఇరువర్గాల ఘర్షణ

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని పోలినాయుడి చెరువు గ్రామంలో సోమవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గత శనివారం గ్రామంలో గంధమహోత్సవం జరిగింది. ఆ సమయంలో రెండు వర్గాల మధ్య వివాదం చెలరేగింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు వచ్చి సర్దిచెప్పి వెళ్లారు. అయితే సోమవారం మళ్లీ వివాదం చెలరేగడంతో రెండు వర్గాల వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

రొయ్యల మేత కేంద్రంలో అగ్నిప్రమాదం



కోవూరు: మండలంలోని పడుగుపాడు వేగూరు కాలువ సమీపంలో రొయ్యల మేత తయారీ కేంద్రంలో సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారంతో రెండు అగ్నిమాపక వాహనాలొచ్చి మంటలను ఆర్పాయి. కాగా పక్కనే ఫెనాయిల్ తయారీ కేంద్రాలుండగా మంటలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకున్నారు.

కండలేరులో 54.984 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 54.984 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి 180 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 650, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 200, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

పాఠశాల తనిఖీ



కోవూరు : మండలంలోని పచ్చిపాల రామనాథమ్మ జెడ్పీ బాలికోన్నత పాఠశాలను మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర పరిశీలకుడు కిష్టప్ప సోమవారం పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఝాన్సీరాణికి పలు సూచనలు చేశారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

కొడవలూరు: అధికారులు తమ విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీఓ ఏవీ సుబ్బారావు హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాలని, తాగునీటి సదుపాయాలు కల్పించడంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ సర్వేలు సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు. ఎంఎస్ఎంఈ సర్వే చేయడంలో అలసత్వం వహిస్తే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. సచివాలయ సిబ్బందికి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరన్నారు. ఈఓపీఆర్డీ సాయిప్రసాద్ మాట్లాడుతూ ఇంటి పన్నులు సకాలంలో వసూలు చేయాలని, చెత్తతో సంపద కేంద్రాల నిర్వహణను మెరుగు పరచాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్బారావు

అధికారుల నిర్లక్ష్యం తగదు

తోటపల్లిగూడూరు: నరుకూరు – తోటపల్లిగూడూరు దారిలో కుంగిన బ్రిడ్జిని పునరుద్ధరించడంలో అధికారులు నిర్లక్ష్యం తగదని సీపీఎం మండల కార్యదర్శి ఈపూరు లక్ష్మయ్య అన్నారు. నరుకూరు సెంటర్ సమీపంలో కోడూరు కాలువ పక్కనే ఉన్న పంట కాలువ వంతెన 40 రోజుల క్రితం బీటలు వారి ఒరిగిపోయింది. దీంతో నరుకూరు – తోటపల్లిగూడూరు దారిలో వాహన రాకపోకలకు తీవ్ర విఘాతం కలుగుతోంది. ఈ క్రమంలో స్థానికులు అనేకమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. సీపీఎం నాయకులు సోమవారం మండల కార్యాలయం ఎదుట నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రం అందజేశారు. లక్ష్మయ్య మాట్లాడుతూ సగం రోడ్డు మూసుకుపోవడంతో ప్రమాదకరస్థితిలో వాహన రాకపోకలు సాగించాల్సి వస్తోందన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి మారుబోయిన రాజా, సీపీఎం మండల నాయకులు బండి శౌరి, నాయకులు మోచర్ల రాధయ్య, కందిపాటి రమణమ్మ, అజ్మా తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

సమష్టి కృషితోనే అవార్డు



విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

- ఏపీ జెన్‌కో సీఈ సుధీర్‌బాబు

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీ జెన్‌కో థర్మల్ ప్రాజెక్టుకు బెస్ట్ పర్ఫార్మెన్స్ అవార్డు రావడం వెనుక కాంట్రాక్ట్ కార్మికుల నుంచి సీనియర్ ఇంజినీర్ల వరకు సమష్టి కృషి ఉందని చీఫ్ ఇంజినీర్ సుధీర్ బాబు అన్నారు. సోమవారం ప్రాజెక్ట్ వద్ద విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఏపీఎస్ఈబీ ఇంజినీర్స్ అసోసియేషన్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సీఈ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎస్పీఎఫ్ గార్డుల గౌరవ వందనం స్వీకరించారు. జ్యోతిరావ్ పూలే దంపతులు, బీఆర్ అంబేడ్కర్, దామోదరం సంజీవయ్య విగ్రహాలకు పూలమాలలు వేశారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

వెంకటాచలం: మండలంలోని చెముడుగుంట సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ద్విచక్ర వాహనాలు నడిపే వారు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని సీఐ సుబ్బారావు, ఎస్సై ఆంజనేయులు సూచించారు. అన్ని పత్రాలుంటేనే వాహనాలు నడపాలని తెలియజేశారు.



వాహనదారులతో మాట్లాడుతున్న పోలీసులు

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి చూపాలి

- వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు

వెంకటాచలం: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి చూపాలని విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న వర్సిటీలో సోమవారం ఇంటర్ కాలేజియేట్ పురుషుల క్రీడా టోర్నమెంట్‌ను ఇన్‌చార్జి వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ చూపిన వారిని గుర్తించి ప్రోత్సహిస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ సీహెచ్ వెంకట్రాయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ

పక్కాగా పంటకోత ప్రయోగాలు

తోటపల్లిగూడూరు: రబీ వరి సాగుకు సంబంధించి వ్యసాయ శాఖ సిబ్బంది పంటకోత ప్రయోగాలను పక్కాగా చేపట్టాలని మండల గణాంకాధికారి రామ్‌ప్రసాద్ సూచించారు. మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో సోమవారం సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ త్వరలో కోతలు ప్రారంభమవుతున్న దృష్ట్యా పంట కోత ప్రయోగాలు చేపట్టాల్సి ఉందన్నారు. వివిధ అంశాలపై శిక్షణనిచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి శిరిషారాణి, మండల డీటీ శివయ్య తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ ఇస్తున్న మండల గణాంకాధికారి

శివాలయం రోడ్డుకు భూమిపూజ

కొడవలూరు: మండలంలోని గండవరంలో కొలువైన ఉదయకోశ్వరస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. వచ్చే నెలలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో రోడ్డు నిర్మాణం చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ రాష్ట్ర డైరెక్టర్ పట్టాభిరామిరెడ్డి తెలిపారు. ఉప సర్పంచ్ ఆలం మాలకొండయ్య, నీటి సంఘ అధ్యక్షుడు కె.ఈశ్వర్‌రెడ్డి, స్థానిక నేతలు సురేష్, పెనాక వెంకటేశ్వర్లురెడ్డి, సీహెచ్ రాఘవరెడ్డి పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో పేదల చెంతకే వైద్యం



కొడవలూరు: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా పేదల చెంతకే వైద్య సేవలు అందేలా కృషి చేయాలని అదనపు డీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెంలో జరిగిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటి వద్దకే వెళ్లి వైద్య సేవలందించేలా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. యల్లాయపాళెం వైద్యాధికారిణి కావ్య, ఏఎన్ఎం దీనమ్మ పాల్గొన్నారు.